
వక్ఫ్ భూముల పరిరక్షణపై దృష్టేదీ..!

పాలమూరులో ఏడు వేల ఎకరాల్లో ఆక్రమణలు



మహబూబ్‌నగర్‌లో ఓ ప్రాంతంలో వక్ఫ్‌భూములు అంటూ ఏర్పాటు చేసిన బోర్డు

ఈనాడు, మహబూబ్ నగర్: పాలమూరులో వక్ఫ్ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట పడటంలేదు. పూర్వ మహబూబ్‌నగర్‌లో 4,561 సంస్థలకు 11,500.18 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. వీటిలో సుమారు ఏడు వేల ఎకరాలకుపైగా భూములు అన్యాక్రాంతమైనట్లు గతంలోనే వక్ఫ్ బోర్డు గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో 1,592 చిల్లాలు, 1,523 అసూర్‌ఖానాలు, 766 ఖబర్‌స్థాన్‌లు, 297 మజీదులు, 223 దర్గాలు, 160 ఇతర సంస్థలకు ఈ భూముల కేటాయింపులు జరిగాయి. ప్రస్తుతం వీటిలో సగానికిపైగా భూములు వివిధ ప్రాంతాల్లో కబ్జాల్లో ఉన్నాయి. వీటి పరిరక్షణలో వక్ఫ్ బోర్డు ఉదాసీనత ప్రదర్శిస్తుండటంతో ఈ స్థలాల్లో స్థిరాస్తి వ్యాపారాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయి. పెద్ద భవంతులను నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం వక్ఫ్ భూముల క్రయవిక్రయాలు చేయకూడదు. ఉమ్మడి జిల్లాలో ఇవేవీ అమలు కావడం లేదు. తరచూ ఏదో ఒక ప్రాంతంలో ఈ భూములపై వివాదాలు నెలకొంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో వక్ఫ్ భూములు పలు ప్రాంతాల్లో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ముఖ్య ప్రజాప్రతినిధులు, స్థానిక నేతల సహకారంతో పలుచోట్ల ఈ భూములను రికార్డుల్లోనూ లేకుండా చేస్తున్నారు. భూములు కబ్జా అయినట్లు గుర్తించిన వక్ఫ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

● మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రెండు సర్వే నంబర్లలో 13 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సగానికిపైగా ఆక్రమణలకు గురయ్యాయి. మిగతా స్థలాల్లోనూ ఇతరుల కన్ను పడింది. తొలుత చిన్నపాటి షెడ్డులు వేసుకుని తర్వాత ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఇక్కడ ఎకరా విలువ సుమారు రూ.2 కోట్లకుపైగానే ఉంటుంది.

● నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో మొత్తం 460 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. ఊట్కూరు, పులిమామిడి, కొల్లూరు, నిడుగుర్తి, పెద్దజట్రంలో ఈ భూములున్నాయి. కేవలం ఊట్కూర్‌లోనే 328 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలుండగా ఇప్పటికే పలు భూములు అన్యాక్రాంతమైనట్లు సమాచారం. గతంలో ఈ భూములను కొందరు స్థిరాస్తి వ్యాపారికి విక్రయానికి పెట్టడం వివాదాస్పదమైంది. తర్వాత కూడా ఈ భూములను అధికారులు పట్టించుకోవడం మానేశారు.

● వనపర్తి జిల్లా అమరచింతలోని ఓ దర్గాకు వివిధ సర్వే నంబర్లలో 60 ఎకరాలకుపైగా స్థలాలున్నాయి. ఈ భూముల్లో సగానికి పైగా అన్యాక్రాంతమయ్యాయి. ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసినా ఫలితం లేకపోయింది.

● గద్వాల పట్టణంలోనూ వక్ఫ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టారని కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి విచారణ జరగలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ కొన్నిచోట్ల వక్ఫ్ స్థలాలు కనిపించడం లేదు.

పూర్తిస్థాయిలో సర్వే చేస్తే..

వక్ఫ్ భూములపై అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేయడం లేదు. సర్వే చేసి హద్దులు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలి. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు ఈ భూములపై నిరంతరం నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం కమిటీల వివరాలు కావాలని ఇటీవలే ఉన్నతాధికారులు కోరారన్నారు. ఈ భూముల పరిరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 90శాతం భూములు గెజిట్‌లో ఉన్నాయని, వీటిని అన్యాక్రాంతం చేయడానికి వీలు లేదన్నారు.

జంగిల్ సఫారీని ప్రారంభించిన మంత్రి

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యంలోని జంగిల్ సఫారీని ఫర్హాబాద్ గేట్ వద్ద వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం పునఃప్రారంభించారు. 3 కొత్త పర్యాటక వాహనాలను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నల్లమలలో పర్యాటకాభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టును తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్‌గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



సఫారీని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

కొరవడిన ప్రత్యేక కార్యాచరణ

దృష్టి సారిస్తేనే పదిలో ఉత్తమ ఫలితాలు



మానవపాడులో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: పదో తరగతి వార్షిక ఫలితాల్లో ఏటా జిల్లా విద్యార్థులు ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నారు. మొదటి నుంచి ఉత్తమ ఫలితాలు సాధిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నా.. ఫలితాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం సైతం అందుకు ప్రత్యేక కార్యాచరణ కనిపించడం లేదు. ఇప్పటికే తరగతులు ప్రారంభమై నాలుగు నెలలు కావస్తోంది. అయినా ప్రత్యేక తరగతుల జాడలేదు. గత ఫలితాల నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత చేపట్టాల్సి ఉన్నా.. ఆ దిశగా అడుగులు పడటం లేదు.

● పదో తరగతి వార్షిక పరీక్షల్లో 2018 విద్యా సంవత్సరంలో 23వ స్థానంలో నిలిచిన జిల్లా, గతేడాది 81.38 శాతం ఉత్తీర్ణతతో 32వ స్థానంలో సరిపెట్టుకొంది.

● తెలుగు సబ్జెక్టులో 695 మంది అనుత్తీర్ణులయ్యారు. సైన్సులో 522 మంది, లెక్కలు చేయలేక 507 మంది అనుత్తీర్ణులయ్యారు.

గత పరీక్షల్లో సబ్జెక్టు వారీగా పరిస్థితి ఇలా..

సబ్జెక్టు	అనుత్తీర్ణులు	ఉత్తీర్ణతా శాతం
తెలుగు	695	90.31
హిందీ	1	99.99
ఇంగ్లిషు	265	96.31
గణితం	507	92.93
సైన్స్	522	92.72
సాంఘిక	66	99.08

గత ఫలితాల పరిస్థితి ఇదీ: జిల్లాలో ఉత్తీర్ణత శాతం తగ్గడంలో తెలుగు సబ్జెక్టు కీలక పాత్ర పోషించిందని చెప్పొచ్చు. జిల్లా వ్యాప్తంగా 146 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు చెందిన 7,203 మంది విద్యార్థుల్లో 7,175 మంది పరీక్షలు రాయగా, 1,336 మంది అనుత్తీర్ణులయ్యారు. హిందీ, సాంఘిక సబ్జెక్టుల్లో మంచి ప్రతిభతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, తెలుగులో గాడిన పడలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన వాటి సంఖ్య, పది పాయింట్లు సాధిస్తున్న వారు కూడా గతంతో పోలిస్తే తగ్గింది. కేవలం రెండంకెల రెండు పాఠశాలల్లో మాత్రమే వందశాతం ఉత్తీర్ణత సాధించడం జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది.

సబ్జెక్టు ఉపాధ్యాయులేక: పదో తరగతి ఫలితాలపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. అలాగే గతేడాది ఫలితాలను బేరీజు వేసుకొని, ఏ సబ్జెక్టుల్లో విద్యార్థులు రాణించలేదో గుర్తించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనికి ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలతో చాలా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గట్టు, రాజోలి, అయిజ మండలాల్లో సమస్య జఠిలంగా ఉంది. సబ్జెక్టు బోధకులు లేక విద్యార్థులు వెనుకబాటుకు గురవుతున్నారు. సమస్య ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు లేదా వాలంటీర్ల నియామకం చేపట్టాలి. జిల్లా అధికారులు లోపాలను అధిగమించి, నడిగడ్డ జిల్లాలో ఉత్తీర్ణతా శాతం పెంపుకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చర్యలు చేపడతాం: అందరి సహకారంతో ఈ సారి జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తాం. పదో తరగతి కార్యాచరణ రూపొందించే పనిలో ఉన్నాం. ఎఫ్ఏ-1 పరీక్షల అనంతరం రోజూ ఒక పూట ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూస్తాం.
-రవీందర్, ఇన్‌ఛార్జి డీఈవో, గద్వాల

ఎంవీఎస్ కళాశాలకు మహర్దశ

రూ.10కోట్లతో త్వరలో పీజీ విద్యార్థినుల వసతిగృహం నిర్మాణం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

న్యూస్‌టుడే, పాలమూరు : ఉమ్మడి జిల్లాకే కీలకమైన మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలకు మహర్దశ రానుంది. ఇక్కడి పీజీ విద్యార్థినుల కోసం పీఎం ఉష పథకం కింద రూ.10 కోట్ల నిధులతో బాలికల వసతి గృహం మంజూరైంది. కళాశాలలో 3,910 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎంవీఎస్ నాలుగో స్థానంలో ఉంది. అందుకే రాష్ట్రంలో ములుగు కళాశాలతో ఎంవీఎస్‌కు పీజీ బాలికల వసతిగృహం మంజూరు చేశారు. దీన్ని కళాశాల ప్రాంగణంలో ఇప్పటికే ఉన్న బాలికల వసతి గృహం పక్కనే రెండు అంతస్తులతో విశాలంగా, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా నిర్మించనున్నారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో దసరా తర్వాత పనులను చేపట్టనున్నారు. ఈ భవన నిర్మాణానికి కేంద్రం రూ.6కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.4కోట్లను మంజూరు చేసింది.

ఉద్యోగార్థులకు కూడా వసతి : ఎంవీఎస్ కళాశాలలో ఇప్పటికే ఉన్న వసతిగృహంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులు ఉంటున్నా అది ఏమాత్రం సరిపోవటం లేదు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సులను 500ల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కొత్త వసతిగృహం నిర్మిస్తే దాన్ని పీజీ విద్యార్థినులకే కేటాయిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ స్టడీ సర్కిళ్లలో శిక్షణ తీసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మహిళలు, విద్యార్థినులకు కూడా ఎలాంటి రుసుము లేకుండా వసతి, భోజనం కల్పిస్తారు. 250 మంది ఉండే నిర్మించే ఈ వసతి గృహంలో ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేసి పోటీ పరీక్షల పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచుతారు. వసతి గృహం ముందు చిన్న ఉద్యానం కూడా ఏర్పాటు చేస్తారు.

100 గదుల ప్రణాళికకు పచ్చజెండా : కళాశాలలో ఏటా కొత్త కోర్సులు మంజూరవుతున్నాయి. విద్యార్థుల సంఖ్య కూడా ఏటికేడు పెరుగుతోంది. ఇప్పటికే ఉన్న తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో రూ.70 కోట్ల వ్యయంతో రెండస్తుల్లో 100 తరగతి గదులను నిర్మించడానికి రూపొందించిన బృహత్తర ప్రణాళికకు ప్రభుత్వం నుంచి పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. దాతలు, పూర్వ విద్యార్థుల అందించే విరాళాలతో వీటిని నిర్మించాలని కళాశాల యాజమాన్యం యోచిస్తోంది.



అన్ని రంగాల్లో ముందుంచుతాం.. : ఎంవీఎస్ కళాశాలలోనే నేను చదివాను. ఇప్పుడు ఆ ప్రిన్సిపల్‌గా పనిచేయటం గొప్ప అనుభూతి. కళాశాల అభివృద్ధికి నా నెల వేతనంలో సగం ఇస్తాను. నాతో పాటు చాలా మంది సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు. అందరి సౌజన్యంతో కళాశాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని రకాల వసతులను కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పీఎం ఉష కింద మంజూరైన వసతిగృహం నిర్మాణ పనులు టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీకి ప్రభుత్వం అప్పగించింది.
- కె.పద్మావతి, ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

బస్టాండులో నాలా తొలగింపునకు అడుగులు

● 'ఈనాడు' వరుస కథనాలతో కదలిక
● రూ.2 కోట్ల అంచనాతో ఈఎన్‌సీకి ప్రతిపాదనలు



ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం మీదుగా ప్రవహిస్తున్న పెద్ద చెరువు నాలా

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని బస్టాండులో ప్రయాణికులకు దుర్గంధం వెదజల్లుతూ, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రాణ సంకటంగా పరిణమించిన పెద్దచెరువు మురుగు నాలా తొలగింపునకు అడుగులు పడుతున్నాయి. ఈ మురుగు నాలాపై 'ఈనాడు'లో వరుస కథనాలు ఇస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీఎం సుజాత ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, డిపో ఉద్యోగులు అనారోగ్యాల బారినపడుతున్న వైనాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మురుగు కాల్వ దారి మళ్లించే విషయమై పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనతో ఇటీవల పురపాలక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ప్రయాణ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న పెద్దచెరువు నాలా దుస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆ తర్వాత పురపాలక ఈఈ బస్వరాజ్, వారి ఇంజినీరింగ్ బృందంతో ఆర్టీసీ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న నాలాను పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్, పీర్లబావి వైపు డిపో వెనక ప్రదేశాన్ని కూడా పరిశీలించి నాలాను ఎక్కడి నుంచి ఎలా దారి మళ్లించాలో ఒక అంచనాకు వచ్చారు. అంబేడ్కర్‌నగర్ సామాజిక భవనం వద్ద బస్టాండు వైపు పెద్దచెరువు నాలా దారి మళ్లిన విషయం తెలిసిందే. నాలా మొత్తం బస్టాండు ఆవరణ గుండా వెళ్లకుండా చర్యలు చేపడతారు. బస్టాండు ప్రహరీ లోపల 3 మీటర్ల విస్తీర్ణంతో 2 మీటర్ల లోతుతో డిపో ప్రహరీ వెనక భాగం గుండా పీర్లబావి వైపు దారి మళ్లిస్తారు. ఇలా 300 మీటర్ల వరకు నాలాను పొడిగిస్తూ పెద్దచెరువు వరకు నిర్మిస్తారు. ఈ పనుల కోసం రూ.2కోట్ల నిధులు అవసరమని ఈఈ బస్వరాజ్ అంచనా వేశారు. ఈ నివేదికను గత నెల రెండో వారంలో అటు ప్రజారోగ్య శాఖ ఈఎన్‌సీకి, ఇటు సీడీఎంఏకు పంపించారు. నిధులు మంజూరైన వెంటనే బస్టాండు గుండా ప్రవహిస్తున్న నాలాను దారి మళ్లించే పనులు చేపడతామని ఈఈ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



డిపో ప్రహరీ పక్క నుంచి పెద్దచెరువు వైపు నాలా పొడిగిస్తూ నిర్మించాల్సిన ప్రదేశం

వెయ్యి టీఎంసీలకు చేరువలో..

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టుకు గత 16 ఏళ్ల వ్యవధిలో వచ్చిన వరదను పరిశీలిస్తే ఇప్పటి మూడు సార్లు మాత్రమే వెయ్యి టీఎంసీలు దాటింది. ఈ ఏడాది మరో నాలుగైదు రోజుల్లో నాలుగోసారి వరద వెయ్యి టీఎంసీలు దాటనుంది. జులై 19 తేదీ ప్రాజెక్టుకు వరద మొదలైంది. ఆగస్టు చివరి వారంలో అత్యధికంగా 3.89 లక్షల క్యూసెక్కులు నమోదైంది. 75 రోజుల వ్యవధిలో జూరాలకు 950.70 టీఎంసీల వరద చేరింది. మంగళవారం జూరాలకు 95 వేల క్యూసెక్కుల వరద కొనసాగుతోంది.



జూరాల ప్రాజెక్టు వద్ద వరద (పాతచిత్రం)

ఏడాది	వరద (టీఎంసీల్లో)
2015-16	45
2016-17	378
2017-18	315
2018-19	1460
2019-20	1425
2020-21	866
2021-22	820
2022-23	1236
2023-24	155
2024-	950

(అక్టోబర్ 1 తేదీ వరకు)

విద్యార్థులకు లక్ష్య సాధన ప్రధానం



బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులతో న్యాయమూర్తి గంటా కవితాదేవి

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలు నిజం చేస్తూ లక్ష్య సాధనతో ముందుకెళ్లాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంటా కవితాదేవి విద్యార్థులకు సూచించారు. గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒత్తిళ్లను లెక్కచేయకుండా సానుకూల వాతావరణాన్ని కల్పించుకుని ప్రణాళికాబద్ధంగా చదువును కొనసాగించాలని చెప్పారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆట ఆడారు. జీహెచ్ఎం వెంకటనర్సయ్య, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద గాయానికి పదిహేనేళ్లు

కలగానే మిగిలిన పునరావాసం

రాజోలి, అలంపూర్, న్యూస్‌టుడే: తుంగభద్ర, కృష్ణా నదుల విలయ తాండవానికి పదహేనేళ్లు గడిచాయి. ఒక్కసారిగా ముంచెత్తిన వరదలు గ్రామాల రూపురేఖలనే మార్చేశాయి. వేల ఇళ్లు నేలమట్టం అయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయాయి. ఆ విపత్కర పరిస్థితుల నుంచి ప్రజలు ఇంకా కోలేదు. ఆ గ్రామాల్లో వరద ఛాయలు సమసిపోలేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. వారి తలరాతలు మారక ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయి.



రాజోలిలో పిల్లర్ల దశలో నిలిచిన నిర్మాణాలు

నాటి పరిస్థితి ఇదీ..

2009 అక్టోబరు 2వ తేదీన వచ్చిన వరదలతో అలంపూర్ నియోజకవర్గంలోని దాదాపు 25 గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. వేల మంది వరద బాధితులు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. 5వేలకు పైగా గృహాలు నేలమట్టం అయ్యాయి. రాజోలిలో చేనేత కార్మికులు కట్టుబట్టలతో మిగిలారు. సుమారు 15వేలకు పైగా ఎకరాల పంట నష్టం జరిగి, ఇసుక మేటలు వేశాయి. వందలాది మంది ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. ఈ క్రమంలో ప్రజలను ఆదుకోవడం కోసం అప్పటి ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలుకు నోచుకోక, పునరావాసం కలగానే మారింది.

ఇళ్లు అసంపూర్తి : వరదలకు నష్టపోయిన ప్రజలకు పునరావాసం కల్పించేలా 5,700 గృహాలకు పైగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటి వరు 2,800 గృహాలు మాత్రమే పూర్తి చేశారు. పదేళ్లుగా నిర్మాణాలు చేపట్టడం లేదు. రాజోలిలో 3,500కి పైగా నిర్మించాల్సి ఉండగా, 350 పిల్లర్ల దశలో, మరో 500 ప్రారంభం కాలేదు. తుమ్మిళ్లలో 499లో 305, టి.గార్లపాడులో 268, నసనూరులో 313 గృహాలు పిల్లర్ల దశలో, కప్పులెవల్, ప్లాస్టింగ్ చేయకుండా ఉన్నాయి. కుట్కనూరు, ఆర్.గార్లపాడులో మాత్రమే నిర్మాణాలు పూర్తి చేశారు. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ముళ్లపొదలు పెరిగి పునరావాస ప్రాంతాలు అడవిని తలపిస్తున్నారు. ఇక అలంపూర్, మద్దూరు గ్రామాల్లో ఒక్క పునాది కూడా తీయలేదు.

సమస్యలతో సహవాసం

రాజోలి, తుమ్మిళ్ల, కుట్కనూరు, ఆర్.గార్లపాడు గ్రామాలలో పూర్తయిన వరద గృహాలలో ప్రజలు నివాసం ఉంటున్నా వీరంతా ప్రతి నిత్యం సమస్యలతో సావాసం చేస్తున్నారు. అతి ముఖ్యమైన ప్రధాన, అంతర్గత రహదారులు ఏమాత్రం బాగు పడలేదు. చిన్నపాటి వర్షం వచ్చినా పూర్తి బురదమయంగా మారి కాలు బయట పెట్టలేని దుస్థితి నెలకొంది. మగ్గం గుంతలో నీరు ఊటలా వచ్చి రాజోలి చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా: అలంపూర్ పట్టణంలో ఇళ్లు పడిపోయిన వారికి స్థలాలిచ్చి ఇంటి నిర్మాణాలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. 42 ఎకరాల భూమిని సేకరించినా ఇంటి నిర్మాణాలకు ఇంతవరకు దిక్కులేదు. దీంతో చాలా మంది ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు.

నీటి నాణ్యత పరీక్షలపై శిక్షణ

మల్దకల్, న్యూస్‌టుడే: గ్రామాలకు నాణ్యమైన తాగునీటిని అందించాలని ఎస్ఈ శ్రీధర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల కార్యాలయంలో గ్రామపంచాయతీల మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి నాణ్యతను పరీక్షించే విధానాన్ని గురించి సాంకేతిక అధికారులైన అన్వర్, నవీన్ అవగాహన కల్పించారు. మంచినీటి పైపులు లీకేజీ జరిగిన సమయంలో తాగునీరు కలుషితమైతే తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈఈ పరమేష్ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల పనులు పూర్తి చేయండి: కలెక్టర్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణ శివారులో నిర్మిస్తున్న కళాశాల నిర్మాణ పనులను పరిశీలించడంతో పాటు, పనుల పురోగతిపై సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో విద్యార్థులకు కల్పించే వసతులకు అనుగుణంగా నిర్మాణ పనులు ఉండాలని, అసంపూర్తిగా ఉన్న పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. తరగతి గదులు, ల్యాబ్‌లలో అవసరమైన సౌకర్యాలు వీలైనంత తొందరగా అందుబాటులోకి తీసుకుని రావాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి కావాలన్నారు. అంతకు ముందు పాత ఎస్పీ కార్యాలయం, గంజిపేటలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త భవన నిర్మాణం పూర్తి అయిన తరువాత విద్యార్థులను అక్కడికి తరలిస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ హనుమంతమ్మ, ఈఈ జైపాల్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సురేష్, ఏఈ రహీముద్దీన్, కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మల్దకల్, న్యూస్‌టుడే: అయిజ పట్టణంలోని 132/ 33కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో పవర్ నియంత్రిక సామర్థ్యాన్ని పెంచుతున్నందున బుధవారం నుంచి 6వ తేదీ వరకు రోజూ 2 నుంచి 3 గంటలపాటు మల్దకల్, నాగర్‌దొడ్డి, తాటికుంట, మల్లెందొడ్డి, మల్దకల్, మద్దలబండ, బిజ్వారం, బూడిదపాడు విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బాపూ మాట.. బంగారు బాట



- అమలు చేస్తే ప్రగతి పరుగులు
- నేడు గాంధీ జయంతి

న్యూస్‌టుడే- అచ్చంపేట, కోస్గి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఆయన మాటలు సమాజ హితానికి బంగారు బాటలు వేస్తాయి. శాంతి, అహింస సిద్ధాంతాలను నమ్మిన మహాత్ముడు వాటితోనే పోరాటం చేశారు. గాంధీజీ అహింస, మద్యపాన నిషేధం, అంటరానితనం నిర్మూల, గ్రామ స్వరాజ్యం, నిజాయతీ, మత సామరస్యం వంటి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటి చెప్పారు.

ఆదర్శం.. అనుసరణీయం

మహాత్ముడు మంచి మార్గం ఎక్కడున్నా అనుసరించాలి

★ **పాలమూరులో ఇలా:** నారాయణపేట జిల్లా ఎక్లాస్‌పూరులో గత 15 ఏళ్లుగా మద్య నిషేధం అమలు చేస్తున్నారు. మాతా మాణికేశ్వరి అహింస, మద్యపాన నిషేధం, శాంతిని భక్తులకు ప్రబోధించే వారు. ఆమె భక్తులు ఇప్పటికీ అనుసరిస్తున్నారు. అచ్చంపేట సమీపంలోని బక్కలింగాయపల్లిలో కూడా సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఈ గ్రామంలో అత్యధికులు గిరిజనులు ఉండటం విశేషం.

అంటరానితనం అమానుషం

అంటరానితనం అమానుషం. సృష్టిలో అందరూ సమానం. వివక్ష కూడదు.

★ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కృష్ణా మండలం ముడుమాల్‌లో ఇటీవల దళితుల పెళ్లి అడ్డుకున్నారని ఆలయ పూజారిని విధుల నుంచి తొలగించారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పౌర దినోత్సవాన్ని నిర్వహిస్తూ అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నారు.

సత్యమేవ జయతే!

మహాత్ముడు నిజాయతీకి మారుపేరుగా నిలిచారు. చేసిన తప్పులను గుర్తించి సరిచేసుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు.

★ ఉమ్మడి జిల్లాలో ఎన్నో సమస్యలు ఏళ్ల తరబడిగా ఎన్నికల వాగ్దానాలుగా ఉపయోగపడుతున్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా హామీ ఇవ్వడం పరిపాటిగా మారింది. గెలిచిన తరువాత ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదు.

అహింసతోనే విజయం

అహింసతోనే విజయాన్ని సాధించవచ్చని మహాత్ముడు ప్రబోధించారు. భారతదేశాన్ని సుమారు వందల ఏళ్లపాటు పాలించిన ఆంగ్లేయుల బారి నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు అహింస మార్గాన్ని ఎంచుకున్నారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (పాత)

★ ఎన్నికల ఘట్టంలో గతంలో హింస చెలరేగి రక్తపాతం చోటు చేసుకునేది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ, ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి హింసకు తావు లేకుండా ఎన్నికల సంఘం బాపూజీ ఆశయాలను అమలు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో సఫలీకృతమైంది.

మద్య నిషేధంతోనే అభివృద్ధి

మహాత్ముడు మద్యనిషేధంతోనే ప్రగతి సాధ్యమవుతుందని చాటి చెప్పారు. మద్యంతో ఎన్నో అలజడులు చోటు చేసుకుంటున్నాయి. గాంధీజీ బాటలో నడచేందుకు పాలకులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.



★ మద్యం ఉమ్మడి జిల్లాలో ఏరులై పారుతోంది. తిమ్మాజిపేట టీసీబీసీఎల్ నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 153 మద్యం దుకాణాలు, 23 బార్లు ఉన్నాయి. నెలకు రూ. 150 కోట్ల విలువైన అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రత్యేక ఉత్సవాలు, పండగలు, ఎన్నికల సమయంలో అదనంగా మరో రూ. 50 కోట్ల విలువైన మద్యం అమ్ముడవుతోంది. నెలకు 2.09 లక్షల కేసుల మద్యం, 2.51 లక్షల కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. తాగుడుకు బానిసలై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

సంపూర్ణ పారిశుద్ధ్యం

మహాత్ముడు సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం 32.7 శాతం గ్రామీణ గృహాలకు మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నట్లు తేలింది.

★ ప్రధాని మోదీ సంసద్ ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా 2014 అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రారంభించారు. గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని ప్రతి ఎంపీ తన పరిధిలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రారంభంలో కొంత హడావిడి కనిపించినా పూర్తి స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో ప్రస్తుతం 72 శాతం వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకున్నారు.



★ అచ్చంపేట మండలం బక్కలింగాయపల్లిలో వెయ్యి జనాభా ఉంది. తొలిసారి సర్పంచిగా ఎన్నికైన లక్ష్మీలాలునాయక్ కుమారుడు నవీన్‌కుమార్ ఎక్సైజ్ డీఎస్పీగా ఉన్న సమయంలో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ శ్రీదేవి సహకారంతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. నాటుసారా బట్టీలు ధ్వంసం చేసి ప్రజల ఆలోచనలో మార్పుతీసుకొచ్చారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్డి ఏర్పాటు చేసుకున్నారు. శుద్ధజల కేంద్రంతో అందరికీ నీరందిస్తున్నారు. ఊళ్లో మూడు వేల మొక్కలు నాటి ప్రతి మొక్క సంరక్షణకు ట్రీగార్డును ఏర్పాటు చేయించారు. 7 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి చక్కగా నిర్వహిస్తున్నారు.





మహబూబ్‌నగర్ : ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

చిత్తూ చిత్తుల బొమ్మ..
శివుడి ముద్దుల గుమ్మ..

'చిత్తూచిత్తూల బొమ్మ... శివుడీ ముద్దుల గుమ్మ... బంగారు బొమ్మ దొరికేనమ్మో ఈ వాడలోనా'.. వంటి బతుకమ్మ పాటలతో ఊరూవాడా నాట్యమాడుతోంది. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ సంబరాలకు జిల్లా సన్నద్ధమైంది. దసరా సెలవుల కారణంగా విద్యాలయాల్లో కాస్త ముందే బతుకమ్మల సంబరాలు చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరులో కొన్ని స్కూళ్లు, కళాశాలల్లో సందడి చూద్దామా.. - **న్యూస్‌టుడే, బృందం**



దేవరకద్ర: చౌదర్‌పల్లి వద్ద కళాశాలలో నిర్వహించిన వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు



ఉండవల్లి: అలంపూర్‌చౌరస్తాలో..



వెల్దండ: కొత్తతాండ సమీపంలో ఓ పాఠశాలలో..



పేట డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే పర్ణిక



అచ్చంపేట: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

చదువులకు విరామం.. ఇళ్లకు పయనం







1. సొంత గ్రామాలకు వెళ్తున్న విద్యార్థులు 2. సీటు కోసం సర్కస్ ఫీట్లు 3.బస్సులో స్థలం లేక ఫుట్‌బోర్డుపై ప్రయాణం

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల చదువులకు కొన్ని రోజులు విరామం లభించింది. బుధవారం నుంచి సెలవులు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న వారు మంగళవారం ఇళ్ల బాటపట్టారు. ఈ నేపథ్యంలో గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో కన్పించిన చిత్రాలే ఇవి.


కల్వకుర్తి పురపాలికకు స్వచ్ఛతా గుర్తింపు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి పురపాలికకు అవార్డు ప్రకటించింది. గత నెల 17నుంచి నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడంతో పుర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రభుత్వం అభినందించింది. తడి పొడి చెత్తను వేరుచేసి తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు డీఆర్సీ సెంటర్‌ను నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు, పురకమిషనర్‌కు అవార్డు అందించనున్నారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి కార్యాలయం నుంచి పుర కమిషనర్‌కు సమాచారం అందించారు. బుధవారం దిల్లీలో జరిగే స్వచ్ఛభారత్ దివాస్ కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కమిషనర్ మహమూద్ షేక్, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, సభ్యులు దిల్లీకి బయలుదేరారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం 2017లో కర్నూలుకు చెందిన విజయానంద్ ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి కేసు విషయాలను పరిశీలించి సాక్ష్యులతో విచారణ చేసి మంగళవారం తన తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన పీపీ పరందాములు, ఏపీపీ బాలస్వామి, అప్పటి సీఐ రామకృష్ణ, ఎస్సైలు గడ్డం కాశీ, విజయ్‌కుమార్, సీఐ గాంధీనాయక్, ఏఎస్సై బాలకృష్ణ, నాగిరెడ్డి, అశోక్‌రెడ్డిలను ఎస్పీ డి.జానకి అభినందించారు.

రాగి జావ ఇచ్చేదెలా?



'మింగ మెతుకులేదు.. మీసాలకు సంపెంగ నూనె' అన్న నానాడి సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూరులో పోషణ జాతర సందర్భంగా మంత్రి సీతక్క చేసిన ప్రకటన చూస్తే గుర్తుకొస్తోంది. అంగన్వాడీల్లో గర్భిణులు, చిన్నారులకు అదనంగా రాగిజావ ఇస్తామని మంత్రి చెప్పారు. ఇప్పుడు ఇస్తున్న నిధులే ప్రభుత్వం చెబుతున్న లక్ష్యాలకు ఏమాత్రం సరిపోని పరిస్థితుల్లో రాగిజావ ఎలా అందజేస్తారన్నది ప్రశ్న.



న్యూస్‌టుడే- నారాయణపేట న్యూటౌన్

ప్రస్తుతం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం కోసం రోజుకు ఒక్కొక్కరికీ 70 పైసలు అందజేస్తోంది. బాలింతలు, గర్భిణులు ఒక్కొక్కరికీ రూ.1.50 చొప్పున ఇస్తోంది. ధన్వాడలో ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసుకుంటే ఇక్కడ మొత్తం పది మంది పిల్లలు ఉన్నారు. వీరికి అదనంగా ఏడుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలు ఉన్నారు. వీరందరికీ రోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని వండి అందించాల్సి ఉంది. ఈ లెక్కన పది మంది పిల్లలకు రోజుకు రూ.7, బాలింతలు గర్భిణులకు రూ. 15 ప్రభుత్వం అందజేస్తోంది. ఈ రెండింటినీ కలిపితే మొత్తం రూ. 22 ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలను పరిగణలోకి తీసుకుంటే రూ.22కు పావుకిలో కూరగాయలూ రావు. వీటితో 20 మందికి పౌష్టికాహారం వండి పెట్టాలంటే ఎలా సాధ్యమో ప్రభుత్వానికే తెలియాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు 'కొన్నది వంకాయ.. కొసిరింది గుమ్మడి కాయ" చందాన్ని తలపిస్తున్నాయి.

- ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలనే ముందు పెడుతుంటారు. కొన్ని సందర్భాల్లో కొంతమందికి అదనంగా వండి వడ్డించాల్సి వస్తోంది. ఇది మరికొంత అదనపు భారం. కొంతమంది అంగన్వాడీ కార్యకర్తలు నిబద్ధతతో ఉన్నంతలో మంచి ఆహారం అందించడానికి ప్రయత్నిస్తుండగా, కొన్నిచోట్ల పై నుంచి కింది స్థాయి వరకు చేతులు తడుపుతూ హాజరులో నమోదులో మతలబు చేసి పిల్లల కడుపు కొడుతున్నారు.

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో 5,548 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారుగా 2.80 లక్షల పిల్లలు, 40వేల దాకా బాలింతలు, గర్భిణులు ఉన్నారు. వీరందరికీ ప్రతిరోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందించాలి. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు చాలకపోవడంతో నిర్వాహకులు ఏ కూరగాయ తక్కువ ఉందో దాన్నే కొనుగోలు చేసి వడ్డిస్తున్నారు. మాటి మాటికీ వీటినే పెడుతుండటంతో పౌష్టికాహారం అనే మాటకే విలువే లేకుండా పోతోంది. కొన్ని కేంద్రాల్లో తక్కువ ధరకు వస్తాయని బజార్లలో రెండోరకం సరకు కొంటున్న సందర్భాలూ ఉంటున్నాయి. అధికారులు తనిఖీలకు వస్తున్నారని తెలిస్తే మాత్రం కొంత మెరుగ్గా భోజనం ఉంటుంది.

◇ గతంలో వంట గ్యాస్ కోసం ఒక్కొక్క విద్యార్థికీ రోజుకు రెండు పైసలు, బాలింతలు, గర్భిణులకు మూడు పైసలు చొప్పున ఇచ్చేవారు. కొన్ని సంవత్సరాలుగా వీటిని నిలిపేశారు. ప్రస్తుతం సిలిండర్ నిధులను నిర్వాహకులే భరించాల్సి వస్తోంది. గత ఏడాది ఉనుంచి పోపు దినుసుల ప్యాకెట్లను అందజేస్తున్నా, అరకొరగా ఉండటంతో ఏ మాత్రం సరిపోవడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. మళ్లీ బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కూరగాయలకు ఇస్తున్న నిధులు మరీ తక్కువ ఉండటాన్ని గుర్తించకుండా నాణ్యమైన పౌష్టికాహారాన్ని వడ్డించాలని కోరుతుండటం విస్మయాన్ని కలిగిస్తోంది. నిధులు పెంచితే రాగిజావ అందించడం పెద్ద కష్టం కాబోదని అంగన్వాడీ కార్యకర్తలు అంటున్నారు.

ప్రాణం తీసిన అరతులం బంగారం

తోడుగా ఉన్నవాడే నిందితుడు ● వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఒంటరితనానికి ఒక తోడు దొరికిందనుకుంది ఆ మహిళ.. కానీ ఆ తోడే అర తులం బంగారం కోసం తన ప్రాణాలు తీస్తుందని ఊహించలేకపోయింది. షాద్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీలో ఇటీవల కవర్‌లో దొరికిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు వివరాలు వెల్లడించారు. చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ భాగ్యలక్ష్మి(40) కొన్నేళ్లుగా ఫరూక్‌నగర్‌లోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవించేది. గద్వాల జిల్లా చాగాపూర్‌కు చెందిన వడ్డె రమేష్ తాపీ మేస్త్రీ. వ్యసనాలకు బానిసైన ఇతన్ని భార్యాపిల్లలు వదిలేయడంతో 8 నెలల క్రితం షాద్‌నగర్ వచ్చాడు. ఒకేచోట కూలిపనులు చేసే వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఒంటరిగా ఉన్న తనకు ఓ తోడు దొరికిందనే సంతోషంతో ఆమె అడిగినప్పుడల్లా అతడికి డబ్బులు ఇచ్చేది. ఆమె చెవులకున్న అర తులం బంగారు కమ్మలమీద కన్నేశాడు. ఈ క్రమంలోనే గత నెల 27న ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. చెవికమ్మలతో పాటు ఇంట్లో ఉన్న రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించి మృతదేహాన్ని కవర్‌లో చుట్టి శ్రీనివాసకాలనీలో పారేశాడు. సీఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ సీఐ ప్రశాంత్, ఎస్సైలు శరత్, సుశీల, శంకర్, సిబ్బంది జోత్స్న, నరేందర్‌లు బృందంగా ఏర్పడి మూడు రోజుల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా కేసును వేగంగా పరిష్కరించిన పోలీసులకు ఏసీపీ నగదు రివార్డులు అందజేశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

అలంపూర్‌లో వైభవంగా ఉత్సవాలు : కలెక్టర్

గద్వాల కలెక్టరేట్, ఉండవల్లి, న్యూస్‌టుడే: జోగులాంబ అమ్మవారి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్లో దసరా ఉత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 3 నుంచి 12 వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కర్‌ఘాట్ వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు, ఆరోగ్య, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండాలని, ఉత్సవాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడిపించాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా ఆ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు, దేవాలయం చేరుకునే మార్గంలో రోడ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఆర్డీవో రాంచందర్, ఈవో పురేందర్, అధికారులు పాల్గొన్నారు.



అలంపూర్‌చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

- అలంపూర్‌చౌరస్తా, డి.బూడిదపాడు, భైరాపురం కూడలిలో ప్రవేశద్వారాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల వివరాలను ప్రవేశద్వారంపై పొందుపరిచారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

మానవపాడు, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి అందరి సమన్వయ సహకారంతో తన వంతు కృషి చేస్తామని డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బాధ్యతలు స్వీకరించాక.. తొలిసారిగా మానవపాడు సహకార సంఘం కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. కలుకుంట్ల గ్రామానికి చెందిన ఓ రైతుకు రుణమాఫీ కాకపోవడంతో సొసైటీ అధికారులను నిలదీశారు. డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, సొసైటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, అయ్యన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య: ననసూరు గ్రామంలో విద్యుత్తు సమస్య ఎక్కువగా ఉంది. తరచూ కోతల కారణంగా రాత్రివేళ ఇబ్బంది పడుతున్నాం. కొన్ని రోజులుగా సమస్య నెలకొంది.

- లక్ష్మినారాయణ, గ్రామస్థుడు

పరిష్కారం : సమస్య ఉన్నట్లుగా నా దృష్టికి రాలేదు. సిబ్బందితో తెలుసుకొని చర్యలు చేపడతాం.

- సందీప్, విద్యుత్తు ఏఈ

-న్యూస్‌టుడే, రాజోలి

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్.. దేవర, సత్యం సుందరం
అయిజ: శివసాయి : దేవర, **భువనేశ్వర్ :** 100 కరోడ్స్
మాధవ్ : సత్యం సుందరం **- న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ**

ధర్మకర్తల కమిటీ సభ్యుల జాబితా విడుదల

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాల ధర్మకర్తల కమిటీ సభ్యుల జాబితాను మంగళవారం దేవాదాయశాఖ విడుదల చేసింది. 13 మంది సభ్యులతో పాటు ఒక ఎక్స్‌అఫీషియోతో జాబితా విడుదల చేసింది. సభ్యులుగా బి.నాగేశ్వర్‌రెడ్డి, కురువ జయరాముడు, జగన్‌మోహన్ నాయుడు, నాగశిరోమణి, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, కురువ గోపాల్, సురేందర్ స్వామి, సరస్వతి, వెంకటేశ్వర్లు, పులేందర్, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా దిండిగల్ ఆనందశర్మలను ప్రకటించింది. ఇందులో ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం ఉంది.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని పిలుపు

మల్దకల్ : మల్దకల్ మండల కేంద్రంలో త్వరలో జరగనున్న భారాస ఆత్మీయ సమ్మేళనానికి వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని భారాస పార్టీ నాయకుడు డి. శేఖర్‌నాయుడు అన్నారు. పార్టీ నాయకుడు హన్మంతునాయుడు ఆదేశాల మేరకు మంగళవారం చర్లగార్లపాడు, శేషంపల్లె, నీలిపల్లె, ఎద్దులగూడెం తదితర గ్రామాల్లో పర్యటించి పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి గంటా కవితాదేవి పేర్కొన్నారు. మంగళవారం ఐడీవోసీలోని సమావేశం హాల్లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. పిల్లలు తల్లిదండ్రులను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తే కోర్టులో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు మాట్లాడారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. ఆర్డీవో రాంచందర్, డీడబ్ల్యూవో సుజాత, డా. వినోద్, బాలకిషన్, అచ్చన్నగౌడ్, రామలింగయ్య సాయిబాబా, సుధాకర్, రంగన్న ఉన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా వెంకటస్వామి

అలంపూర్, న్యూస్‌టుడే: సీపీఎం అలంపూర్ పట్టణ కార్యదర్శిగా వెంకటస్వామి ఎన్నికైనట్లు జిల్లా కమిటీ సభ్యులు రాజు, రేపల్లె దేవదాసు, ఈదన్న తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ ప్రజా పోరాటాలను ఉద్ధృతం చేస్తామన్నారు.

ఒంటికీ.. రెంటికీ.. బయటకే!

పాఠశాలల్లో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు ● 'న్యూస్‌టుడే' పరిశీలనలో వెల్లడి

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఒంటికీ, రెంటికీ ఎక్కడో బయటకు వెళ్లాల్సిన పరిస్థితి పలు పాఠశాలల్లో ఉంది. పలు స్కూళ్లలో అసంపూర్తి నిర్మాణాలు కన్పిస్తున్నాయి. మరి కొన్ని పాఠశాలల్లో కనీసం ఒక్కటి కూడా లేదు. అలంపూర్ నియోజకవర్గంలో సోమవారం 'న్యూస్‌టుడే' పరిశీలన ఈ అంశాలు వెల్లడయ్యాయి. **-న్యూస్‌టుడే బృందం**


అయిజలో నిర్మాణంలో మరుగుదొడ్లు

అయిజ: స్థానిక ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 175 మంది విద్యార్థులుండగా ఇందులో 95 మంది విద్యార్థినులున్నారు. వీరు కాలకృత్యాలు తీర్చుకోడానికి పాఠశాల మైదానం, ముళ్లకంపల్లోకి వెళుతున్నారు. మన ఊరు మనబడి కింద ఇక్కడ మరుగుదొడ్లు నిర్మాణంలో ఉన్నాయి.

రాజోలి: ఉన్నత పాఠశాలలో 300 మంది బాలికలు, 250 మంది బాలురు చదువుతున్నారు. బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి చొప్పున రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఒంటికి, రెంటికి బయటకో, స్నేహితుల ఇళ్లకో వెళ్లాల్సిన పరిస్థితి. రెండు మరుగుదొడ్ల నిర్మాణ దశలోనే ఉండిపోయాయి.

మానవపాడు: జల్లాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 130 మంది విద్యార్థుల్లో 77 మంది బాలికలున్నారు. పాఠశాలలో మూత్రశాల, శౌచలయం కలిపి రెండు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఒకటి ఉపాధ్యాయులు వినియోగించుకుంటుండగా, 77 మంది బాలికలకు మరోటి వాడుకుంటున్నారు. ఇక్కడా నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి.

శాంతినగర్: శాంతినగర్ ఉన్నత పాఠశాలలో 430 మందికి సుమారు 200 మంది బాలికలున్నారు. మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పాఠశాల ఆవరణలో ఒక మూలకు రేకులు అడ్డుగా పెట్టి అబ్బాయిలు మరుగుగా వాడుకుంటున్నారు.

వడ్డేపల్లి : తనగల జడ్పీ ఉన్నత పాఠశాలలో 255 మంది బాలబాలికలకు రెండే మరుగుదొడ్లున్నాయి.


శాంతినగర్ ఉన్నత పాఠశాలలో రేకులను అడ్డుగా పెట్టి..

దీంతో విద్యార్థులు రహదారుల వెంబడి మూత్ర విసర్జన చేస్తుండటంతో పొలాలకు వెళ్లే సమయంలో దుర్వాసన భరించలేకున్నామని స్థానికులు అంటున్నారు.


అలంపూర్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో..

అలంపూర్: అలంపూర్ బాలుర ఉన్నత పాఠశాలలో 125 మంది బాలురకు రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఇక మూత్రశాలలు ఉన్నా అపరిశుభ్రత తాండవిస్తోంది.

ఇటిక్యాల: మునుగాల ఉన్నత పాఠశాలలో 67 మంది విద్యార్థులకు మూడు మూత్రశాలుండగా అందులో రెండు ఉపాధ్యాయులు ఉపయోగించుకుంటూ విద్యార్థులకు ఒక్కటి కేటాయించారు. పాఠశాలలో సగం మంది విద్యార్థినులే ఉన్నారు. వీరికి ఇబ్బందులు తప్పడంలేదు.

ఉండవల్లి: ఉండవల్లి ఉన్నత పాఠశాలలో 440 మంది విద్యార్థులున్నారు. ఇందులో సగానికిపైగా బాలికలే. 24 మంది బోధనా సిబ్బందిలో ఉపాధ్యాయినులే ఎక్కువ. ఉన్నవి రెండే మరుగుదొడ్లు. వీటినే ఉపాధ్యాయినులు, బాలికలు వాడుకోవాల్సిన పరిస్థితి. బాలురకు రెండు మరుగుదొడ్లు నిర్మించినా బిల్లులు రాక తాళం వేసి ఉన్నాయి.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన


అయిజలో నిరసన తెలుపుతున్న ఏఈవోలు

అయిజ, ఉండవల్లి, గట్టు, న్యూస్‌టుడే: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేలో గ్రామస్థాయిలో సహాయకులను ఏర్పాటు చేయకపోవడంపై మంగళవారం అయిజలో ఏఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సహాయకులను ఏర్పాటు చేయాలని గతంలో రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడికి వినతిపత్రం అందజేసినా ఫలితంలేదన్నారు. రైతు వేదిక వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లోకరాజు, ఏఈవోలు పాల్గొన్నారు. ● ఉండవల్లిలోనూ నిరసన తెలిపారు. ఏవో అనిత సంఘీభావం తెలిపారు. ఏఈవోలు హసీనాబేగం, అధీల్, రాజేష్, పరమేశ్‌గౌడ్, శిల్ప పాల్గొన్నారు. ● ఏవో హనుమంతురెడ్డితో పాటు, అన్ని క్లస్టర్ల ఏఈవోలు మంగళవారం గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలోని రైతు వేదిక వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒక్కో ఏఈవో 5 నుంచి 8 గ్రామాల్లో సుమారు 6 నుంచి 10వేల ఎకరాల వరకు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ కష్టసాధ్యం కావటంతో కేంద్రం వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా గాంధీ జయంతి


మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గట్టు, న్యూస్‌టుడే: బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మండలకేంద్రంలోని కస్తూర్బా, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల విద్యార్థులు మంగళవారం జాతిపితకు నివాళులర్పించారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఉన్న బాపూ విగ్రహం వద్దకు ఉపాధ్యాయులు, విద్యార్థులు చేరుకుని విగ్రహానికి పూలమాలలు వేశారు. స్వాతంత్య్ర ఉద్యమంలో గాంధీజీ పాత్రపై ఉపాధ్యాయులు వివరించారు. అంతకు ముందు ఆయా పాఠశాలలో విద్యార్థులకు గ్రామస్వరాజ్యం స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బ్యాంకు సేవల సద్వినియోగంతో లబ్ధి


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న రీజనల్ మేనేజర్ రంజిత్

ఇటిక్యాల, న్యూస్‌టుడే: బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ వారణాసి రంజిత్ గ్రామస్థులకు సూచించారు. మంగళవారం వల్లూరులో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బ్యాంకు ఖాతాదారు మురళీధర్‌రెడ్డి తండ్రి రామిరెడ్డికి బీమా సొమ్ము రూ.20 లక్షల చెక్కును అందజేశారు. ఖాతాదారు సాధారణ బీమా చేసుకోవడంతో లబ్ధిపొందారన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. మోసపూరిత ఫోన్ కాల్స్ పట్ల జాగ్రతగా ఉండాలని సూచించారు. సీనియర్ మేనేజర్ గౌతమ్ రెడ్డి, బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

బిజ్వారం @ ఎంబీబీఎస్


సాయివర్ధన్‌రెడ్డి | ఎస్.రమ్య | సానియాబ్రైటీ | అక్షయ

మల్దకల్, గట్టు, న్యూస్‌టుడే: మల్దకల్ మండలం బిజ్వారం నుంచి నలుగురు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఇప్పటికే గ్రామం నుంచి 19 మంది ఎంబీబీఎస్ పూర్తిచేయగా, వీరితో ఆ సంఖ్య మరింత పెరగనుంది. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రెడ్డిగారి సాయివర్ధన్ రెడ్డి నీట్‌లో 534 మార్కులు సాధించగా వికారాబాద్‌లోని కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించాడు. గ్రామానికే చెందిన ఎస్.రమ్య 380 మార్కులతో గద్వాల వైద్యకళాశాలలో సీటు సాధించింది. * గట్టు బాలికల గురుకుల పాఠశాలలో చదివిని వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన రైతు శ్రీనివాస్ కూతురు సానియాబ్రైటీ 472 సాధించి కామారెడ్డి మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్‌గా ఉన్న శంకర్ కూతురు అక్షయ 477 మార్కులు సాధించి కరీంనగర్ మెడికల్ కళాశాలలో సీటు సాధించినట్లు ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు.

పట్టుదలతో చదివి..



నా పేరు సాయివర్షిణి. 720కి 609 మార్కులు సాధించాను. తల్లిదండ్రులు విష్ణుఆచారి, ఝాన్సీరాణి. కుటుంబ నేపథ్యం కార్పెంటర్. ఒకటి నుంచి 5వరకు గద్వాల ప్రైవేటు పాఠశాల, 5 నుంచి పది వరకు పట్టెం నవోదయ పాఠశాల. ఇంటర్ అమీస్తాపూర్‌లో చదివాను. కోచింగ్ లేకుండా పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సిద్ధిపేటలో సాధించాను.

కోచింగ్ లేకుండానే..



నాపేరు ఝాన్సీరాణి. మార్కులు 551. తల్లిదండ్రులు విజయకుమార్, కవిత. కుటుంబ నేపథ్యం వ్యవసాయం. ఒకటి నుంచి 10వరకు గద్వాల ప్రైవేటు పాఠశాల. ఇంటర్ హైదరాబాదులో చదివాను. కోచింగ్ లేకుండానే డైరెక్టుగా నీట్‌రాశాను. మొదటి సారికే సిద్ధిపేట వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాను. రోజూ ఎంతో లక్ష్యంగా చదువుతూ పరీక్ష రాశాను.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


ధరూరు ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


ఉండవల్లి: బొంకూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంబురాలు


మానవపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో..


ఇటిక్యాలలో దసరా వేడుకలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా ముస్తాబు చేసిన బతుకమ్మలను తలపై పెట్టుకొని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలికలు సంప్రదాయ దుస్తుల్లో కనువిందు చేశారు. బతుకమ్మలు ఆడి, సమీపంలోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు.

-న్యూస్‌టుడే బృందం


మల్దకల్ కేజీబీవీలో..


గద్వాల: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో..


రాజోలి మండలం తుమ్మిళ్లలో ఊరేగింపు


వడ్డేపల్లి మండలం రామాపురంలో...


ఇటిక్యాల: చాగాపురం ఉన్నత పాఠశాల విద్యార్థినులు


బతుకమ్మలతో అలంపూర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు

నిబంధనలు పాటించకపోతే చర్యలు

అయిజ, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంఈవో రాములు దయాళ్ పేర్కొన్నారు. మంగళవారం అయిజలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ ధ్రువపత్రం, డ్రైవర్లకు లైసెన్స్ ఉంచాలని సూచించారు. విద్యార్థులను తీసుకెళ్లే బస్సులను ఇష్టారాజ్యంగా నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. దసరా, సంక్రాంతి సెలవు దినాల్లో తరగతులు నిర్వహించారని హెచ్చరించారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులతోనే బోధనా తరగతులు నిర్వహించాలన్నారు.

టోల్‌ప్లాజా సిబ్బంది నిరసన



నిరసనలో పాల్గొన్న పుల్లూరు టోల్‌ప్లాజా సిబ్బంది

ఉండవల్లి, న్యూస్‌టుడే: పుల్లూరు టోల్‌ప్లాజాలో తొలగించిన ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలని సిబ్బంది కార్యాలయం వద్ద రెండో రోజు నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ, ఉద్యోగుల పట్ల టోల్‌ప్లాజా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఇలాంటివి సరికాదని తెలిపారు. యాజమాన్యానికి ముందుగానే తెలిపిన స్పందించడం లేదని వాపోయారు. విధుల్లో నుంచి తొలగించిన హుస్సేన్‌భాషాను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం ఉద్ధృతం చేస్తామన్నారు. పీటర్, లాజర్, వెంకట్రాముడు, శేషన్న, హుస్సేన్ భాషా, నాగన్న, ఓబులేష్, రామ్, లక్ష్మణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే కీలకం

మానవపాడు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని మండల విద్యాధికారి శివప్రసాద్ అన్నారు. మానవపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మన్న విద్యాశాఖ తరపున జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ తరపున రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఇటీవల పొందారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయ బృందం ఆయనకు సన్మానించారు.


తాగునీటి ఇబ్బందులు తీర్చండి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గట్టు మండలంలో పలు గ్రామాల్లో కొద్ది రోజులుగా ప్రజలు పడుతున్న తాగునీటి ఇబ్బందులు తొలగించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. స్పందించిన అధికారులు రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు. మిషన్ భగీరథ నూతన ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈఈలు భీమేశ్వర్, శ్రీధర్‌రెడ్డి, డీఈఈ రవిచంద్రారెడ్డి, ఐహెచ్‌పీ ఏజెన్సీ మోహన్ తదితరులున్నారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళలకు ఉచితంగా పరీక్షలు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఈ నెల 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్‌ను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 040-23551235, 23550967 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం


జగన్నాథ్‌రెడ్డి (పాత చిత్రం)

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాల మండలం గుర్రంగడ్డ (దివిసీమ)లో పూడ్చి పెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి వైద్యులు పోస్టుమార్టం చేశారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జగన్నాథ్ రెడ్డి 20 ఏళ్ల కిందట హైదరాబాద్ వెళ్లి అక్కడే తన కుటుంబంతో స్థిరపడ్డాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ని వైద్య సేవల నిమిత్తం కుటుంబ సభ్యులు గత నెల 27న అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ అదే రోజు మృతిచెందాడు. మరుసటి రోజు సొంతూరైన గుర్రంగడ్డలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి శరీరంపై గాయాలున్నట్లు తెలుసుకున్న కూతురు సౌమిక రెడ్డి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మంగళవారం గద్వాల మండల తహసీల్దార్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో గుర్రంగడ్డ గ్రామానికి వెళ్లారు. తహసీల్దార్ పర్యవేక్షణలో పూడ్చిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు.

క్రైం కార్నర్

రేషన్ బియ్యం పట్టివేత

ఇటిక్యాల, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. జింకలపల్లి గ్రామ శివారులోని రైసు మిల్లులో రేషన్ బియ్యం నిల్వలున్నట్లు సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మహర్షితో కలిసి తనిఖీ చేశారు. ఇందులో 108 ప్యాకెట్లు సుమారు 50 క్వింటాళ్ల బియ్యం నిల్వలను గుర్తించారు. అనుమతులు లేకుండా బియ్యం నిల్వ ఉంచిన రైసు మిల్లు యజమానిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ధరూరు, న్యూస్‌టుడే: కేటిదొడ్డి మండల పరిధిలో పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను కేటిదొడ్డి పోలీసులు అరెస్టు చేశారు. మహేశ్, ఆంజనేయులు ఇద్దరిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఎల్‌ఐసీ ప్రైవేటీకరణ బిల్లు అడ్డుకున్న ఏచూరి

సంస్మరణ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అప్పట్లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసీ ప్రైవేటీకరణ బిల్లును సీతారాం ఏచూరి అడ్డుకున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణం అంబేడ్కర్ కళాభవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు అధ్యక్షతన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఏచూరికి శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ మధు ప్రసంగిస్తూ ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బీమా ప్రైవేటీకరణ బిల్లును ప్రవేశపెడితే తన వాదనతో వెనక్కి పంపేలా చేశారని పేర్కొన్నారు. ఏచూరి ఎంపీగా పార్లమెంటులో గళమెత్తారని, బయట ప్రజా సమస్యలపై పోరాడి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. ఆయన మరణం వామపక్ష పార్టీలకు, దేశాభివృద్ధికి తీరని లోటన్నారు. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా కూడా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ పెట్రో, డీజిల్ ధరలు తగ్గించకపోవడం దారుణమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలను నేరుగా భర్తీ చేసే రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని విమర్శించారు. లౌకికవాద భారతదేశంలో ఒక దేశం, ఒకే ఓటు పేరుతో జమిలి ఎన్నికలు తేవాలన్న ప్రధాని మోదీ ఆలోచన సఫలీకృతం కాదన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ సీతారాం ఏచూరి మహాజ్ఞాని అని కొనియాడారు. ఏచూరితో పాటు ఓ వేదిక పంచుకున్నానని, ఈ సందర్భంగా ఆయన భారత తత్వశాస్త్రంపై అనర్గళంగా మాట్లాడారని గుర్తు చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరనిలోటన్నారు. సభలో పురపాలక సంఘం ఆనంద్ కుమార్ గౌడ్, జేపీఎన్‌సీఈ ఛైర్మన్ కేఎస్ రవి కుమార్, సీపీఐ సీనియర్ నాయకుడు కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు రాంచందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, పద్మ, కురుమూర్తి, చంద్రకాంత్, నాయకులు మోహన్, ప్రశాంత్, నందు, భరత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ మధు